**ఈ వారం కథ:**



# కాముని పున్నమి

— ఆకెళ్ళ

**వా**న చినుకైనా లేదు. వర్షం వచ్చే అలికిడైనా లేదు.

గాలి మాత్రం తీవ్రంగా వీస్తోంది. గాలికి చెట్లు తలలు ఊపుతూ విధేయతను ప్రకటిస్తున్నాయి. కను చీకటి కమ్ముకుంటోంది. వంతెన క్రింద నీరు సన్నగా శబ్దం చేసుకుంటూ పారుతోంది.

సిరిపల్లె వంతెన మీద జన సమ్మర్దం వుండే వేళ కాదది. గూట్లో దీపం పెట్టగానే నోట్లో బువ్వ పడేసిన జనం విశ్రాంతి తీసుకుంటున్నారు. అక్కడోటీ అక్కడోటీ వెలుగుతున్న దీపాలు అక్కడున్న ఊరి వునికిని గుర్తు చేస్తున్నాయ్.

ముక్తేశ్వరం నుంచీ అమలాపురం వెళ్లే ఆఖరి బస్ సిరిపల్లె వంతెన దగ్గర ఆగకుండానే వెళ్లిపోయింది. ఏమీ తోచక ఎవరో పాడుతున్న పల్లె పదం ... గాలిలో తేలుతోంది. ఆ పాట రొద పెడుతున్న గాలికి శృతి పెడుతోంది.

వెన్నెల చెట్ల నుంచి రోడ్డు మీదకి జారుతోంది. వెన్నెల వెలుగు - చెట్ల చీకటి కలగలిసి రోడ్డు నలుపు-తెలుపు చదరంగం బల్లలా వుంది. చెట్ల నుంచి ఆకులు ... ఆకలి తీరిన పసిబిడ్డల్లా చెట్టు ఒడిలోంచి జారిపోతున్నాయ్.

"ఈ యేడు దాళ్వాలోనైనా పది బస్తాలు పురికి ఎక్కకపోతే ... ఏటికేడాది ఇంటిల్లిపాదీ పస్తు పడుకోవాల్సిందే ..." సైకిలు మీద వెళ్తున్న ఇద్దరిలో ఒకడు మరొకడితో అంటున్నాడు. సైకిలు దూరమవుతున్న కొద్దీ మాటలు కలగలిసి పోతున్నాయ్.

నిశ్శబ్దాన్ని తిరిగి సాధించిన రోడ్డుకేసి మరోసారి చూసి చక్రపాణి వంతెన మీద చతికిలపడ్డాడు. అతని ఒంటరితనం, చెయ్యాల్సిన దూర ప్రయాణం, చుట్టూ ముసురుకుంటున్న చీకటి, కడుపులో చుట్టబెడుతున్న ఆకలి మెదడుని కలియబెడుతున్న ఆలోచనలు ... తలంతా దిమ్ముగా వుందతనికి. వంతెన క్రింద నీరు నింత శబ్దం చేస్తోంది. మెల్లిగా గట్టునుంచి నీళ్లలోకి దిగేడు. వెన్నెల పడి రాళ్ళు వెండి రాళ్లల్లా మెరుస్తున్నాయ్. నీళ్లలోకి దిగేడు. చల్లగా వుంది, హాయిగా ప్రశాంతంగా వుంది.

నీరు సన్నగా పారుతోంది. చెవులు రిక్కించి విన్నాడు చక్రపాణి. ఆ పారే నీరు ఏదో సన్నగా రోదిస్తున్నట్టు తోచింది. ఈ చల్లదనం కల్ల. గుండెల్లోంచి నీరు వినిపించే విలాపం నిజం. తన వూహ తనకే చిరాకనిపించింది. లేచి నిలబడ్డాడు.

ఆకాశం చంద్రుడిని కన్నందుకు గర్వంతో మెరిసిపోతోంది. పుట్టిన బిడ్డని ఆడించే అమ్మలక్కల్లా మబ్బులు చంద్రుడి చుట్టూ గిరికీలు కొడుతున్నాయి.

బస్ కోసం ఎదురుచూడడం మూర్ఖత్వం. ఒకవేళ బస్‌లో రేవుకి చేరినా పడవుండదు. పడవున్నా ... ఈ చీకట్లో ఎవ్వరూ పడవ కట్టకపోవచ్చు. రేవులో తలదాచుకునే అవకాశం కూడా లేకపోవచ్చు. చలిగాలికి బిగుసుకుపోయి తను కట్టె అయిపోవచ్చు. గోదావరి పొంగి తన్ని మింగేయచ్చు ఏదైనా జరగచ్చు ... ఏదైనా జరగనీ ... తను మాత్రం ... ఈ రాత్రి సిరిపల్లెలో గడపలేడు.

ఎక్కడో సన్నటి మువ్వల శబ్దం ... దగ్గరవుతున్న డెక్కల చప్పుడు. చక్రంలో కర్ర పెట్టిన గరగర శబ్దం - నిశ్శబ్దం మాయం అయింది.

"బండి కడతావా?"

"ఎక్కడికి బాబూ?"

"ముక్తేశ్వరం రేవుకి"

"సీకటి ఆడిపోవాది రేవులో పడవ కట్టద్దూ"

మనిషి తలలో చిటికెడంత అనుమానం చేరిందా, చారెడంత మబ్బు పెరిగి పెరిగి విశాలాకాశాన్ని కమ్ముకున్నట్టు పెనుభూతం కావచ్చు. తనతో జీవితాన్ని పంచుకున్నవారిని ఆ అనుమానపు తెరచాటు నుంచి తప్ప అచ్చమైన వెలుగులో చూల్లేకపోవచ్చు. అనుమాన దహనం అయిందా.. ఇక ఆ యౌవన దాంపత్య జీవితం కాముని పున్నమే.

"నువ్వు బండి కడితే ... వాళ్ళు పడవ కడతారు."
బండి వాడిలో తటపటాయింపు "తప్పదంటారా?"
"నాకు వెళ్ళక తప్పదు"
"ఎక్కండి"
తారు రోడ్డు మీద ఇనప చక్రం చేసే వికృత ధ్వని-బండి వూపందుకుంది.

సిగరెట్ కోసం వెలిగించిన అగ్గిపుల్ల వెలుగులో అతన్ని చూశాడు. ముసలో ముతకో ... తెలియడం లేదు. అటు తిరిగి బండి తోలుతున్నాడు. మీసాలు, తలపాగ మాత్రం కనబడుతున్నాయి.

బండి సాగిపోతోంది. బాట కిరుపక్కలా చెట్లు-చెట్ల క్రింద చీకటి - చెట్ల బయట వెన్నెల తిన్నెలు వున్నాయ్. గుర్రం ... తన డెక్కలతో వెన్నెల తిన్నెల్ని తన్నుకుంటూ వెళ్లిపోతోంది. బండిలో క్షణం కాలం చీకటి, క్షణం కాలం వెన్నెల ...

విషాదం, ఆనందం - కష్టాలు ... సుఖాలు. చీకటి-వెలుగు పరస్పర విరుద్ధాలు. అయినా ఒకటి వెనుక ఒకటి పొంచి వుంటాయ్. దాగుడుమూతలాడతాయ్. వెలుతురు - కళ్లు చెదిరే వెలుతురు.

వెయ్యివిద్యుత్ దీపాల్ని ధిక్కరించే వెలుగు - జయ స్నానం చేసొచ్చి గార్డెన్ చెయిర్‌లో కూర్చుంది. పాల నురుగులాంటి తెల్ల చీర. మల్లెల్ని ధిక్కరించే ధవళ చ్ఛాయ. ఒంటి నించి ఉదుకులాం వాసన. కిరణాలు ఆమె నుదుట మీటి అక్కడ నించి బుగ్గల మీదకు, పెదాల మీదకు మనోహరంగా జారుతున్నాయ్. కిరణమే ఆమెగా మారిన అనుభూతి.

ఆమె అందం, వొయ్యారం, నడకలో ధీమా - హుందాతనం శరీర సౌష్టవం|జయ సూదంటు రాయి.

తన చేతుల్లో వేళ్లు, తన పాదాలపై ఆమె పాద ద్వయం. తన పెదవులపై ఆమె అధరాలు. తన గుండెల్ని మెత్తగా హత్తుకుంటున్న ఆమె కుచద్వయం. ఆ ప్రవాహంలో దారి తెలియదు. కాసేపటికి అలసట - నిస్సత్తువ.

చెదిరిన కుంకుమ రేఖలతో ... ఎర్రదనం దిద్దుకున్న పెదవులతో ... అలసిన దేహంతో ... నలిగిన మల్లె పువ్వులా ఆమె నవ్వుతుంది. ఆ నవ్వు అర్థం కానట్టు బాల్కనీకేసి తిరిగితే ఆకాశమంతా ఆమే నిండి వున్న అనుభూతి. చంద్రుడి ముఖంలో ఆమె చిలిపి నవ్వు.

మధుర క్షణాల మాధుర్యం మెదడు కొసలు అంది పుచ్చుకుంటుండగానే ... ఆమెలో పురి విప్పే కాంక్ష. ఆమె రెండు చేతులూ మెడ చుట్టూవేసి తల ముందుకు లాక్కుని కళ్లల్లోకి చూస్తే చాలు ... సృష్టి మరోసారి స్తంభించిపోతుంది. పెద్ద మంట-చిన్న నీటి చుక్కతో ఆరిపోతుంది.


చల్లగాలి ఒంటిని సేద తీరుస్తుండగా ఆ పిల్లగాలి ఆమెలో మరులు రేపుతుంది. తెల్ల మబ్బుల్ని కప్పుకున్న పచ్చ కొండలా మెరిసే ఆమె వక్షం ... గుండెలకు ఒరుసుకుంటూంటే ఊపిరి ఆడదు ... ఉద్రేకం ఉప్పెనలా ఉరుకుతుంది. నిగ్రహం ... ఆ కొండల మీంచి జర్రున జారిపోతుంది. ఎక్కడో ... పిట్ట కూత - ఎక్కడో ... గబ్బిలం ... తలక్రిందులుగా ఎగురుతున్న ధ్వని.

వేళ్ళలోకి దిగుతున్న ఆమె వేళ్లని తప్పించుకుంటూ పక్కకు తిరిగితే ... కోపంతో ఆమె వక్షం ఎగిసిపడుతుంది. వేడి శ్వాస ... బద్ధకాన్ని బద్దలు చేస్తుంది. అరణ్యం అంటుకున్న తర్వాత నిర్లిప్తతగా వుండలేం, దగ్గరగా హత్తుకుంటే ఆమెలోంచి వింత పరిమళాలు. చల్లగాలి తెరలు తెరలుగా పలాయనం - ఇంకా దగ్గర తనం కావాలి.

"ఓ పదం అందుకోనా. బాబు పొద్దు గడిచిపోద్ది" బండివాడు యాసలో ప్రశ్నించేడు.
"వద్దు."
బండివాని మౌనం.
"ఎంత దూరం వచ్చేం"
"పాతిక దూరం దాటేశాం బాబూ"
"తొందరగా పోనియ్"
"అర్జంటు పనా బాబు?"
సమాధానం లేదు. అదంతే సమాధానం రాదు. సమాధానం చెప్పడం జయకు చేతకాదు. ఆమెకు మూడు ముళ్లూ వేసి ఆమెతో అయిదేళ్ల కాపురం చేసేకా ... తనకీ సమాధానం చెప్పే అలవాటు తప్పిపోయింది.

ఆమె సమక్షంలో తనలో ఏదో మార్పు.-ఆమె బుజ్జగిస్తే ... తనలో పురివిప్పే ఆశలు ... ఆమెతో కలిసి తన పరుగు ... ఆమె శరీరం ... తన శరీరాన్ని రాసుకుంటే శరీరం బిగిసి రక్తం ... ఒంటినిండా పరుచుకుని చర్మం క్రింద నరాల్లో చైతన్యం. ఆమె శరీరానికి ఎంతటి శక్తి ... ఎంతటి బలం - ఎన్నో యుగాలు అణిచి పెట్టబడ్డ శక్తి ఎవరెస్టుని ఎదతో కుమ్మగల దారుఢ్యం!

ఆమె ఉవ్వెత్తుగా లేచే కెరటం ... మీదికి వురికే అగ్ని శిఖ. దీపం వెలుగులో ఆమె ముఖంలో వింత అందం. దీపం నీడ ఆమె వక్షం మీద పడి ... వక్షం పెద్దదిగా ... మరికాస్త పెద్దదిగా..ఇంకా పెద్దదిగా ...!



"ఇంతటి ఉద్ధృతం నీకు పెళ్లికి ముందు వుండేదా?"

"ఛ ... ఏ దేం ... ప్రశ్న"

"ప్రశ్న కాదు ... అనుమానం"

"అనుమానం ఆరోగ్యానికి మంచిది కాదు" ఆమె నవ్వింది. మల్లెపువ్వుల మీద మంచు చిలకరించినట్లు అయింది.

"అనుమానం తీర్చుకోవడం మనసుకు మంచిది చెప్పు."

"అన్నప్రాసన కాకుండా ... ఆవకాయ రుచి తెలుస్తుందా?"

"అదే ... ఆ అన్నప్రాసన ఎప్పుడయింది?"

ఆమె ముందుకు వంగి "తొలి రాత్రి ఈ పెదవులు ... నా పెదవుల్ని అందుకున్నప్పుడు" నాలికతో నాలికకు బంధన.

"వదులు."

"వదలను ... నీ మంచి మగ వాసన వేస్తోంది ..." నడుం చుట్టూ జ్వాలలా ఆమె చేతులు చుట్టుకున్నాయ్. ఆమె దగ్గరగా జరిగితే వెచ్చగా - మెత్తగా ... శరీరాన్ని ఆమె ముద్దచేసి నలిపేస్తున్న అనుభూతి ... ఆమె శరీరాన్ని నలిపేస్తోంది. పుస్తకాల రాక్ మధ్య నున్న ఉత్తరం ... గుండెని నలిపేస్తోంది.

'మెరిసేదంతా మేలిమి కాదు. సిరిపల్లె శివరావుని అడిగితే ... నీ శ్రీమతి సరసాలు తెలుస్తాయ్ ... పెళ్లికి ముందు ప్రేమలు బయట పడతాయ్' ఉత్తరం చిరునవ్వు.

ఆమె మెడ చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కుని బుగ్గలు సాగదీస్తూ ఏదో అంటోంది. మాటలు వినపడడం లేదు. నాగస్వరం విన్న పాములా తల వూగింది. శరీరం పట్టు తప్పిపోతోంది. ఆమె తన గుండె మీద నాలి కోమలమైన ఆ చేతితో వక్షాన్ని గిల్లుతోంది.

"అగ్గిపెట్టె వుందా బాబూ"

"ఇప్పుడే అగ్గి అంటుకుంది"

"ఏమిటి బాబూ మీరనేది"

"ఏం లేదు ఇదిగో అగ్గి పెట్టె"

అగ్గిపుల్ల వెలుగులో చూస్తే అతని సందుమీసాలు మెరుస్తున్నాయ్. ముఖంలో నిర్లిప్తత ... చుట్ట రెండు పీల్పులు పీల్చేకా హుషారు.

"సిరిపల్లె ఇంకా బాబూ రావడం"

సమాధానం లేని మరో ప్రశ్న. బండిలోంచి బయటకు పెట్టిన పాదాల మీద వెన్నెల వల్లబడింది. ఒంగి చూస్తే ... చంద్రుడికి దిష్టి తగలకుండా మబ్బులు మూసేసేయ్ ... చల్లగాలి ... అంతకంతకూ ఎక్కువవుతోంది.

పక్కనించి సైకిలు తొక్కుతూ ... ఎవరో ఆసామి "ఎవరిదా బండి ... గంగయ్యదా?" అడిగేడు.

"కాదు బాబు కిష్టయ్యది" బండి అబ్బి సమాధానం.

'తను గంగయ్య కానప్పుడు బండివాడు వూరుకోవచ్చుగా, ఎందుకలా అరవడం ...' అతను మనసులో మూలుక్కున్నాడు.

చీకటి గనుక మనసులో మాట జారిపోయింది కాబోలు ... బండివాడు సమాధానం చెప్పేశాడు.

"గంగయ్య బండి కాదని ఆయనకు తెల్సుకాని సావుగంటో, పది నిమిషాల్లో ఆయన ఒంటిగా సైకిల్ తొక్కుకొచ్చాడు. ఒంటరితనం..గుండెల్లో గుబులు రేపి వుంటుంది. తనకి ఓ తోడుందని అనిపించడానికి ఓ కంఠం వినాలి. ఓ పలకరింపు కావాలి. అందుకే అడిగేడు. అసలు ప్రపంచంలో ఒక్కడే వుండాల్సి వస్తే.. ఆ ఒక్కడు ఎంతకాలం బ్రతకగలడంటారూ?"

అతన్నించి సమాధానం రాలేదు. నల్లరాతి బండ ముందు సోరిస్పటం దండగ అనుకున్నాడు కాబోలు బండివాడు మాట్లాడలేదు.

'నిజమే ఒంటిగా బ్రతకాల్సి వస్తే ఆ ఒంటిగాడు ఎంతో కాలం మిగలడు. అది అనుభవం ఆరాయించుకున్న మాట. జయను వదిలి తను బ్రతకగలడా?' కళ్ళు మూసుకున్నాడు.

మల్లెపువ్వులాంటి చిరునవ్వు.. పచ్చటి దేహం.. బాత్‌టబ్‌లో నడుం లోతు నీళ్ళలో ఆమె కూర్చుంది. చేతులకు పచ్చటి గాజులు తప్ప ఆమె ఒంటి మీద మరేం లేదు. పరిపూర్ణ వికాసం పొందిన యవ్వనం.. సుకుమారమైన చర్మం.. ఆ వొంపులు.. వొయ్యారం.. చూసినప్పుడల్లా కళ్ళకో వింత వెలుగు. నడుం ఒంపులోంచి కొంటెగా తొంగిచూస్తున్న వక్షం... గుండె స్పందన పెరుగుతోంది. తెల్లటి మెడ మీద మెరిసే నీటి ముత్యం అధరాలతో అందుకోబోతుంటే.. చేతులు మెడ వెనుక అల్లుకున్నాయ్. ఆమె శ్వాస బుగ్గల మీద.. కనురెప్పల మీద..మీసం మీద.. ముద్దులతోపాటు వెచ్చగా తాకుతోంది. ముద్దుల వాన ఉంగరాల జుట్టులోంచి జారిపోతోంది.

ఆ ప్రశాంతిలో చిన్న అపశ్రుతి. ఆ అపశ్రుతిని శ్రుతిగా మార్చే ప్రయత్నం.

"రతీదేవికి నువ్వు పాఠాలు చెప్పగలవు."

"నువ్వు మాత్రం.. మన్మథుని బాణాలకు పదును పెట్టగలవు."

"పొగడ్త బావుంది.. ఏకవచనం బాగోలే.."

"మేల్ ఎగో దెబ్బతిందా" ఆమె నవ్వింది. ప్రభాత వేళ పక్షుల కిలకిల ధ్వనిలా వినపడింది.

ఎర్రబడిన కళ్ళతో అతనుచూస్తే.. లేడిపిల్లలా బెదిరిన కళ్ళతో నిస్తుపోయి చూసింది.

"కోపమా? ఏడాది స్నేహం కూడా లేని సుందరం మిమ్మల్ని ఒరేయ్ అనొచ్చు కానీ.. అయిదేళ్ళ స్నేహంతోనున్న నేననకూడదా! భార్య..ఎవరికైనా మొట్టమొదటి స్నేహితురాలు తెల్సునా?"

లాజిక్ బావుంది. కాని గుండెనెక్కడో నొక్కుతోంది. రెల్లు దుబ్బులు.. అడవి తోపులు.. కీకారణ్యం.. తలపైన కొద్దిగా నీలాకాశం.. ముళ్ళ చెట్టు నిండా ఉదారంగు పువ్వులు.. గుత్తు గుత్తులుగా వేలాడుతున్నాయ్. పువ్వు విడిగా చూస్తే అందంగా లేదు. లెక్కలేనన్ని పువ్వులు విరగబూయడం వల్ల అందంగా వున్నాయ్. ఎంత అందంగా వున్నా - ముళ్ళచెట్టు ముళ్ళచెట్టే.

"ముళ్ళచెట్టా. ముళ్ళచెట్టానువ్వెప్పుడు పూయడం మొదలెట్టావ్?"

"నన్నేనా.. ముళ్ళచెట్టు అంటున్నావ్?"

"కాదు"

ఆమె కనుబొమ్మలు విల్లులా వంగేయ్.. ఆ వొంపులోంచి మన్మథ బాణాలు అతని ఒంట్లో పులకలు రేపేయ్. నిగ్రహించుకుని గొంతు పెగిల్చేడు.

"నీ అనుభవం అర్థం కాదు."

"అనుమానం తీరలేదా?"

"ప్రశ్నకి.. ప్రశ్న జవాబు కాదు. చెప్పగలిగితే సక్రమంగా చెప్పు."

"ఏమిటి?"

"అదే..."

"వసంతం రాగానే కోయిలకి కూత ఎవరు నేర్పారు?"

ఆమె సంపెంగలాంటి ముక్కును బుగ్గల మీద రాసింది. వంగి కళ్ళలోకి చూస్తే

ఏ భాషా సాహిత్యంలోనైనా ఉత్తమ సాహిత్య సృష్టి చేసినవారు మహామేధావులై వుంటారు. మేధావులచే సృష్టింపబడిన సాహిత్యమంతా ఎప్పుడూ అంతమందికీ అర్థం కాదు. అప్పుడే విమర్శకుని ఆవశ్యకత ఏర్పడుతుంది. ఆ సాహిత్యంలో వున్న వెలుగు నీడల్ని విడమర్చి పాఠకులకు చూపవలసిన బాధ్యత విమర్శకునిది. విమర్శకుని సాహిత్య విమర్శ స్వచ్ఛమైనదైతే పాఠకులు సత్యాన్ని దర్శించి విజ్ఞానాన్ని పొందుతారు. అలా కాకపోతే అసత్యాన్ని సత్యంగా భ్రమించి అజ్ఞానం పాలవుతారు.

— టి.యల్.కాంతారావు

సేకరణ: తవుటు నాగభూషణం

స్వచ్ఛత.. వెన్నెలవి.. పాలవి.. ధిక్కరించే స్వచ్ఛత! కాని ఆ ఉత్తరం...

సిరిపల్లెలో శివరావు అనే వ్యక్తి లేకపోతే ఆ స్వచ్ఛతను సత్యమని విశ్వసించొచ్చు.. కాని సిరిపల్లెలో శివరావు వున్నాడు. తనెవరో అతనికి తెలీదు కాబోలు.. భీమా ఏజెంటునంటే తలూపేడు. భీమా వెయ్యమంటే పెదవి విరిచేడు.

"భీమా వెయ్యడానికి ఇల్లా - ఇల్లాలా, పెళ్ళా-పెటాకులా" పెదవి విరిచేడు.

"అదేం...?"

"ప్రేమించిన ఆడది మోజు తీర్చుకుని మేనా ఎక్కి మరొకడితో వెళ్ళిపోయింది" కన్నీళ్ళు దాచినా అతను ఎక్కిళ్ళు దాచలేకపోయాడు.

"ఎవరామె?"

"మా దూరపు బంధువే"

"పేరు?"

అతను కళ్ళలో నీరు దాచేందుకు వ్యర్థ ప్రయత్నం చేశాడు.

"అది ఆమెకూ జయం కాదు. నాకూ జయం కాదు, మీరు వెళ్ళనండి" అతను ముఖం తిప్పుకున్నాడు.

చెప్పకుండానే ఆమె పేరు చెప్పేశాడు.

గాలి కెరటం వీచింది. బండికున్న దీపం ఆరిపోయింది.

"దీపం వెలిగిస్తా అగ్గిపెట్టె ఇవ్వండి."

"అక్కర్లేదు."

"అదేటి బాబు!"

"కాస్సేపాగు.. కళ్ళు చీకటికి అలవాటుపడ్డాక పోనియ్."

"అది కాదు బాబూ!"

"ఏది కాదు.. నిత్యం కళ్ళకు గంతలు కట్టుకుని తిరిగే గుర్రానికి వెలుగైనా ఒకటే.. చీకటైనా ఒకటే."

"మనం గంతలు కట్టుకోలేదుగా! మనకు వెలుగు కావాలిగా!"

అతను సమాధానం చెప్పలేదు.

బండి కదల లేదు.

కొన్ని నిమిషాల నిశ్శబ్దం...

చూసి — చూసి అతను అగ్గిపెట్టె అందించేడు. బండివాడు దీపం వెలిగించేడు. దీపం సరిచేస్తూ... ఆ వెలుగులో ఈ ప్రబుద్ధుడెవరన్నట్టు అతని ముఖాన్ని పరీక్షగా చూశాడు. ఆ తర్వాత బండి కదిలింది. క్రని చక్రంలో పెట్టే గర్రుమని శబ్దం చేశాడు.

"ఎందుకా శబ్దం?"

"నిశ్శబ్దంగా వుంటే గుర్రానికి నచ్చదు. ఏదో శబ్దం దానికి అలవాటు. అందుకే పాడతానన్నాను."

"పాడు."

అతను గొంతు సవరించుకున్నాడు.

"చందరయ్యా.. నువ్వు గుండెలు దీసిన బంటువయ్యా—
గురువుకే.. నువ్వు గండం తెచ్చిన దొంగవయ్యా—"

"ఏమిటా పాటా."

"పల్లెపదం బాబు" ఇంకా హుషారుగా అందుకున్నాడు.

"చందరయ్యా.. నువ్వు గుండెలు దీసిన బంటువయ్యా—
గురువుకే నువ్వు గండం తెచ్చిన దొంగవయ్యా—"

"ఆ బూతుపాట ఆపు.. ఇంకేదైనా పాడు."

"అదేటిబాబూ! అసలు బూతు లేందే నీతెక్కడుంది?"

"చాల్లే... ఏ వితండవాదాలు."

"నిజమే బాబు.. బూతు లేందే సృష్టే లేదు. కన్నె తార మొగుడు కాస్సేపు కళ్ళెర్ర చేసినా ఆనక తమాయించుకున్నాడు. అంతెందుకు బాబూ.. అహల్యమ్మ చేసింది — అంతటి తప్పనిస్తే.. ఆమెని రాయిగా వుండనివ్వకుండా రాములోరు ఆడదిగా మారుస్తాడా? తప్పు లేదు కన్నె కరుణించేడు" బండివాడు నవ్వేడు.

ఆ నవ్వు గుండెల్లో మంటని రగిలిస్తోంది. తార మొగుడు బృహస్పతి ఏ బాధని ఎలా భరించేడో, అహల్య మొగుడు గౌతముడి గరళాన్ని ఎలా మింగాడో — శాపాలతో.. వాళ్ళు తమ కోపాల్ని బాపుకున్నారు. అలా చెయ్యడానికి శక్తిలేని ఒథెల్లో... భార్యని చంపేశాడు. చంపెయ్యడమే? జయని తను చంపగలడా? అంత చలిలోనూ ఒంట్లోంచి వణుకు.. బీరువాలో షాక్ కొడుతున్న ఇస్త్రీ పెట్టె. జయకి ఇస్త్రీ పెట్టె షాక్ కొడుతున్నట్టు తెలీదు.. అర్జంటు అంటే బట్టలు — ప్లగ్‌లో పెట్టడమే తరవాయి జయ వెళ్ళిపోతుంది.

అతను చెంపలు తడుముకున్నాడు.. మంచు ముద్దల్లా తగిలేయ్. కన్నీళ్ళు కళ్ళలోంచి కాదు గుండెల్లోంచి కారుతున్నాయ్.

వెలుగు...చీకటి, ఆనందం...విషాదం. అతని గుండె బరువెక్కింది. దూరంగా ముక్తేశ్వరం దీపాలు కనపడుతున్నాయ్.

"ముక్తేశ్వరం.. అత్తారింటికా బాబు?" బండివాడి ప్రశ్న.

అతను సమాధానం చెప్పలేదు. ప్రపంచం అంతా గాఢాంధకారంలో మునిగిపోయినట్టుంది. దూరంగా వున్న దీపాల వెలుగు.. పూర్తి వెలుగు నివ్వలేకపోతోంది.

బండి ఊళ్ళో కొచ్చింది.

"మీ అత్తారింటికి పోనివ్వనా బాబూ"

అతను ఉలిక్కిపడ్డాడు

"రేవుకి పోనియ్."

"ఈవేళప్పుడు పడవ వుండదు. మీ అత్తారింట్లో నిద్ర చెయ్యండి" ఆ మాటతో చలిగాలి.. చుట్టబెట్టింది. వెన్నెముకలోంచి చలి అందుకుంది.

"నే నెవరో తెలుసా?"

"తెలియకేం బాబూ! తమరత్తారిది ముక్తేశ్వరం. మీ పెళ్ళికి నేనొచ్చా.. అప్పుడూ ఇప్పుడూ తమరొక్కలాగే వున్నారు" బండివాడు నవ్వేడు.

"సరే సంతోషం.. నువ్వు రేవుకి పోనియ్. ఏదో పడవ దొరుకుతుంది."

బండివాడు మాట్లాడలేదు. బండి రేవుకేసి తిప్పాడు. సంతెన ఎక్కింది బండి. సంతెన వింత శబ్దం చేస్తోంది.

"మీ పెళ్ళికి.. మీ మాంగారు పిలవలేదుకానీ సిరిపల్లె శివరాం బాబూ నేనూ వొచ్చాం. గొప్ప విందు సేసేరు.. మీ మాంగారు."

"ఎవరొచ్చారు?" ఆత్రంగా అడిగేడతను.

"ఆయేళ శివరాంబాబు బండి కట్టమంటే కట్టాను. మూర్తం కాగానే.. ఆయనతోనే ఎనక్కి మళ్ళాను. వస్తుంటే వర్షం.."

బండివాడి మాటలు కొనసాగుతున్నాయ్. చక్రపాణి తెల్లబోయాడు.

"తనెవరో.. శివరావుకి తెల్సునా? తెల్సి... అలా చెప్పేడంటే—" అతనికి ఊపిరి ఆగినంత పనయింది.

కళ్ళ వెంట.. జలజలా కన్నీళ్ళు కారేయ్.

జయ నవ్వులోంది.. ఆ నవ్వు.. ఇంద్రధనస్సులో ఆడుకుంటున్న పసిపిల్ల నవ్వులా వుంది, లేదు నెమలి పిల్లలా వుంది.. ఆమెలో పొంగుకొచ్చిన ఆనందం.. అక్కున చేర్చుకుంటే ఆనందంతో చెంపలు మీద ఆమె ముద్దుల వాన." కళ్ళు తెరిచి "త్వరగా పోనియ్" అన్నాడు చక్రపాణి.

●

ప్రపంచంలో నిజమైన సిద్ధాంతం ఒకటే వుంటుంది. అది వాస్తవ పరిస్థితుల నుంచి ఉత్పన్నమవుతుంది. తిరిగి వాస్తవ పరిస్థితుల పరీక్షకు నిలబడగలుగుతుంది. దీన్ని తప్ప మరి దేన్నీ మనం సిద్ధాంతం అని పిలవం.

— మావో-సే-టుంగ్

సేకరణ: తవుటు నాగభూషణం